## చతుర కతలు

# అరిష్టం

-దూరి వెంకటరావు




కుటుంబంలో సీరియల్‌గా సంభవిస్తున్న సంఘటనలతో కృంగిపోయాడు కామేశం. కష్టాలన్నీ కట్టగట్టుకుని తననే ఎందుకు పలకరిస్తున్నాయో తెలియడం లేదు.

"ఇంటికేదో శని పట్టిందండి. మీ తాతయ్యగారు పోవడమేంటి? పిల్లాడు పరీక్ష తప్పడమేంటి? పిల్లకొచ్చిన సంబంధం చెడిపోవడమేంటి? " కంటతడిపెడుతూ అన్నది అపర్ణ.

"నువ్వన్నది నిజమేనే. మనింటికేదో దోషం ఉంది. నివారణకి ఏం చెయ్యాలో సిద్ధాంతిగారిని అడుగుతాను" సమస్యకు పరిష్కారం దొరికినట్లు సంబరపడుతూ అన్నాడు కామేశం. ఇంకేముంది 'తలచుకున్నప్పుడే తాత పెళ్లి అన్నట్లు' సిద్ధాంతుల సూచనలమేరకు జపాలు, శాంతులు జరిపించి చేతులు కాల్చేసుకున్నాడు. అయినా అతడి వెతలు తీరలేదు. ఏం చెయ్యాలో పాలుపోక వాస్తు నిపుణుడుని ఇంటికి లాక్కొచ్చాడు.

"ఈ ఇల్లు వాస్తు విరుద్ధంగా కట్టబడింది. అందుకే మీకిన్ని అరిష్టాలు సంభవిస్తున్నాయి" అన్నాడు వైకుంఠం ఇంటిని భూతద్దంలా పరిశీలించి.

"అందుకే కదా మిమ్మల్ని పిలిచింది. వాస్తు ప్రకారం ఏయే మార్పులు చెయ్యాలో సెలవిస్తే..." అర్థింపుగా అంటూ ఆగాడు కామేశం.

"ఇంటిని పడగొట్టించి పునర్నిర్మించవలసిందే. వెంటనే ఆ పని చెయ్యకపోతే మీరు మరిన్ని ఇబ్బందులు పడవలసి వస్తుంది.. చూస్కోండి" హెచ్చరించాడు వైకుంఠం.

ఆలోచనలో పడ్డాడు కామేశం. ఇల్లు పడగొట్టి కట్టించాలంటే మాటలా!?

"మీరా పని చెయ్యలేకపోతే ఏదైనా అద్దె ఇంట్లోకి వెళ్ళిపొండి" అన్నాడు వైకుంఠం అతడి అంతరంగానికి అద్దంపడుతూ.

క్షణాలమీద ఇంటికి 'టు లెట్' బోర్డు తగిలించి అద్దె కొంపలోకి మారిపోయాడు కామేశం.

రోజులు గడుస్తున్నా అందులో దిగడానికి ఎవరూ సాహసించడం లేదు. బహుశా విషయం అందరికి తెలిసిపోయిందేమో!

ఇక ఇలా లాభం లేదనుకుని ఇంటిని అమ్మకానికి పెట్టాడు. అయితే కొనడానికెవరూ ముందుకు రాకపోవడంతో మరింత దిగాలు పడిపోయాడు.

ఇలా ఉండగా ఓ రోజు ఆ ఇంటిని కొనడానికి ఎవరో వచ్చారు.

"పన్నెండు లక్షలిస్తే చెప్పండి"

కామేశం మాటకు ఓ వెకిలి నవ్వు నవ్వి "ఈ పాత కొంపని అంత ధరపెట్టి ఎవరు కొంటారు? పైగా దీనికి వాస్తు దోషం ఉందని తెలిసింది. మేం గనుక ధైర్యం చేసి వచ్చాం. మూడు లక్షలకైతే చెప్పండి ఇవాళే క్యాషిచ్చి తీసుకుంటా" నోరూరిస్తున్నట్లు అన్నాడు ఆసామి.

ఇంకా లేటు చేస్తే ఆ రేటు కూడ పలకదేమోనని సరేనన్నాడు కామేశం.

ఉన్నఫళంగా డబ్బిచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు వచ్చిన వ్యక్తి.

తన కొంపని ఎంతో కారు చవకగా కొట్టేసిన ఆ వ్యక్తి వైకుంఠం కొడుకేనని తెలిసి కంగుతిన్నాడు కామేశం.



# షో బిజినెస్!

-కర్లపాలెం హనుమంతరావు

హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఫస్ట్‌క్లాసు బోగీలో ముగ్గురు రిచ్‌క్లాస్ కుర్రాళ్ళు ప్రయాణం చేస్తున్నారు. విజయవాడలో ఎదురు సీట్లోకి ఒక ఇరవై ఏళ్ళ సెక్సీగర్ల్ వచ్చి కూర్చుంది. బండి తెనాలి చేరేసరికి వాళ్ళకి ఆమెతో మాటలు కలిశాయి. ఆ మాటల మధ్యలో ఆమె పబ్బుల్లో షో బిజినెస్ చేస్తుందనీ, తమిళ సినిమాల్లో చిన్న చిన్న ఐటమ్ సాంగ్స్ ట్రూపుల్లో కూడా కనపడుతుందని కుర్రాళ్ళకి తెలిసింది.



"పొట్టి దుస్తుల్లో ఒళ్ళంతా చూపిస్తూ కనిపించటానికి ఏమీ అనిపించదా మీకు? " అనడిగాడు ఆ బేచ్‌లోని ఒకబ్బాయి ముందుగా కాస్త ధైర్యంచేసి.

"డబ్బవసరం సార్! మీరూ తలా ఒక వంద రూపాలియ్యనంటే పాదాలు చూపించటానికి నేను రెడీ" అందామె వయ్యారంగా అదోలా చూస్తూ.

కుర్రాళ్ళకి హుషారొచ్చింది. మూడొందలిచ్చారు. ఆమె చీరె కుచ్చెళ్లనలా సుతారంగా కొద్దిగా పైకి లాగి పద్మాల్లాగా ఉన్న పాదాలను రెప్పపాటు చూడనిచ్చి ఇలా వదిలేసింది.

బండి బాపట్ల చేరేసరికి ఇంకో కుర్రాడికి కాస్త ధైర్యం పెరిగింది "ఈసారి తలా ఐదొందలిస్తాం. మోకాళ్ళ దాకా చూడనిస్తారా? " అనడిగాడు బిడియపడుతూ,

"ఓకే" అందామె. పదిహేనొందలు తీసుకుని కుచ్చిళ్ళను మరికాస్త పైదాకా లాగి ఓ నిమిషంలో సగం సేపు చూడనిచ్చి దింపేసింది. కుర్రాళ్ళకు కళ్ళు బైర్లు కమ్మాయి. అరగంట గడిచింది. వాళ్ళ వేడి నిట్టూర్పుల సెగలు తగులుతున్న ఆ పిల్ల "తలా వెయ్యి ఇవ్వండి... నేను అంపెడిసైటిస్ ఆపరేషను చేయించుకున్నచోటు కూడా చూపించేస్తాను.. ఓ పనైపోతుంది" అనేసింది మోస్ట్ ఎరోటిక్‌గా. ఈ ఆఫర్ వాళ్ళు ఊహించనిది. వాళ్లు నోరు విప్పి స్వయంగా అడగలేనిది. చచ్చినా ఈ ఛాన్సు వదులుకోకూడదనుకున్నారు ముగ్గురూ.

మూడువేలు పోగేసి ఆమె చేతిలో పోసేసి ఆత్రంగా చూస్తూ కూర్చున్నారు కుర్రాళ్ళు. వాళ్ళ గుండెలు రైలు ఇంజను కన్నా వేగంగా కొట్టుకుంటున్నాయి.

ఆమె లేచి నిలబడింది. చీరె కుచ్చెళ్ళు సర్దుకుంటూ వయ్యారంగా వాళ్ళ ముందుకు నడిచి వచ్చింది.

బండి వేగం తగ్గింది. విండో డోర్ పైకిలాగి.. "నెల్లూరు వస్తున్నట్లుంది" అంది. దూరంగా కనిపించే ఓ బిల్డింగుని చూపిస్తూ "అదిగో.. ఇండో అమెరికన్ ఆసుపత్రి.. అదే నేను అపెండిసైటిస్‌కి ఆపరేషన్ చేయించుకున్న చోటు" అంటూ అప్పుడే ఆగిన రైల్వే ప్లాట్‌ఫామ్ మీదకు చక్కా దిగి.. వెళ్ళిపోయింది.

పిల్లకాయలు నోరెళ్ళబెట్టి చూస్తూ కూర్చున్నారని వేరే చెప్పాలా!

# లేని అందం

- ఎం.వి.వి. సత్యనారాయణ

ఒక రాజు తన నిలువెత్తు రూపం అందంగా వేయించుకోవడానికి తగిన చిత్రకారుడికోసం చాటింపు వేయించాడు. ఎంతోమంది చిత్రకారులను పరీక్షించాక ఒకడిపై అతడికి నమ్మకం కుదిరింది.

"చిత్రాలు అందంగా తీర్చి దిద్దగలవని భావించి నీకు ఈ పని ఒప్పచెబుతున్నాను" అన్నాడు.

"కృతజ్ఞతలు మహారాజా! మీ రూపం ఉన్నది ఉన్నట్టు చిత్రించే శక్తి నా సొంతం. నా ప్రతిభను తమరే గుర్తిస్తారు" చిత్రకారుడు ఆత్మవిశ్వాసం ప్రదర్శించాడు.

"నా మనస్సు నీకర్థం కాలేదు. నా నిలువెత్తు రూపం అతి సుందరంగా ఉండాలి సుమా! భావి తరాలవారు కూడా సమ్మోహితులు కావాలి"

మహారాజంతటివాడు తనతో అంత వివరంగా మాట్లాడుతుండటంతో ఉత్తేజంతో ఊగిసలాడిపోయాడు చిత్రకారుడు. ఆయన మాటలకు వినయపూర్వకంగా తన అంగీకారం తెలిపి చిత్రరచన ప్రారంభించాడు.

మూడు నెలల వ్యవధిలో రాజుగారి నిలువెత్తు చిత్రం పూర్తి చేశాడు. మధ్య మధ్య రాజుకు తన చిత్రీకరణ ఎంత వరకూ వచ్చిందో చూపించే ప్రయత్నం చేశాడు చిత్రకారుడు.

రాజు అంగీకరించలేదు.

"నా చిత్రాన్ని ఎంత సుందరంగా చిత్రీకరిస్తావో ఒకేసారి చూసి సంతృప్తి పడతాను. నీ పనితనం నన్ను మెప్పిస్తే మా కుటుంబ చిత్రాన్ని నువ్వే గీయవచ్చు. నువ్వు జీవించినంత కాలం ఏ లోటూ రాకుండా ఏర్పాటు చేస్తాను" అన్నాడు రాజు.



చిత్రకారుడు ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. రాజుగారికి తనమీద ఎంత గురి కుదరకపోతే అంత గొప్ప అవకాశం కల్పిస్తాడు!

చివరికి నిలువెత్తు చిత్రం ప్రదర్శనకు వచ్చింది.

రాజు దాన్ని చూసి, "చెయ్యి వంకరగా చిత్రించావు. కుడి కాలు కొద్దిగా కురచ పెట్టి అంగ వైకల్యం బయటపెట్టావు. మొహంలో ఎలాంటి సంతోష ప్రకటనగానీ అందంకానీ లేదు" అన్నాడు.

చిత్రకారుడు ఆయన మనస్సు అర్థం చేసుకోకుండా, "చిత్తం మహారాజా! తమ చిత్రం సహజరూపంతో ప్రాణం పోసుకుంది" అన్నాడు.

భటులతో, "ఇతడిని ఉరి తీయండి" అన్నాడు రాజు.

చిత్రకారుడు తెల్లబోయి తానెక్కడ తప్పు చేశానోనని ఆలోచనల్లో తలమునకలయ్యాడు.